## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు 25 మంది టచ్‌లో

మొదటిపేజీ తరువాయి...

వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఒకవైపు ఫిరాయింపులను నివారిస్తామంటూనే మరోవైపు ఫిరాయింపులను ప్రోత్సహించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఇచ్చిన హామీ తెలంగాణలో వర్తించదా? రాష్ట్ర కాంగ్రెస్‌కు అధిష్ఠానం ఆదేశాలు పట్టవా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎంపీ రంజిత్‌రెడ్డిని తమ పదవులకు రాజీనామా చేయించకుండానే కాంగ్రెస్‌లోకి చేర్చుకున్నది. ఇప్పుడు మరో 25 మంది బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వస్తున్నారంటూ ఉత్తమ్ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పూర్తిగా రాజకీయ విలువల్ని వదిలేసిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, ఇతర పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన, చేరబోయే వారిని రాజీనామా చేయించి పార్టీలోకి తీసుకోవాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

## ఒక్కరోజే ఇద్దరి ఆత్మహత్య

మొదటిపేజీ తరువాయి...

బోర్లలో నీళ్లు తగ్గి పంటంతా కండ్ల ముందే ఎండిపోయింది.. పంట చేతికి అందక, అప్పు తడిసి మోపెడవటంతో తీవ్ర మనస్తాపంతో ఉరేసుకున్నాడు. ఈ విషాద ఘటన మెదక్ జిల్లా కొల్చారం మండలం వరిగుంతంలో శనివారం చోటు చేసుకున్నది. కొల్చారం ఎస్సై మహ్మద్ గౌస్, గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాంచ మహేందర్ (35) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గతంలో పండినట్లుగానే పొలంలో పంట పండుతుందనే ఆశతో తనకున్న రెండెకరాల పొలంలో వరి సాగుచేశాడు. నాలుగు బోర్లు పుష్కలంగా నీరు పోస్తాయనే ధీమాతో పంట కోసం అప్పు కూడా తెచ్చాడు. అయితే లోవోల్టేజీతో మూడు సార్లు మోటర్లు కాలిపోయాయి. పంట పెట్టుబడికి అయిన అప్పు, కాలిపోయిన మోటర్లకు చేసిన అప్పు తడిసి మోపడైంది. అదేసమయంలో నాలుగు బోర్లలో క్రమేపీ నీరు అడుగంటడంతో బోర్లలోంచి నీళ్లు రాలేదు. పంటంతా ఎండిపోయింది. ఆరు నెలల కిందట వేసిన కొత్త బోరు కూడా అడుగంటిపోయింది. ఇంకో రెండు తడులు పారితే చేతికొచ్చే పంట ఎండిపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. రూ.3 లక్షలు అప్పు కావటంతో ఆందోళన చెందాడు. శుక్రవారం రాత్రి అంతా ఇంట్లో నిద్రపోగా, తాను మాత్రం ఆరుబయట పడుకున్నాడు. అప్పటికే దిగాలుగా ఉన్న మహేందర్.. ఇంటి ఎదుట రేకుల షెడ్డులో చున్నీతో ఉరివేసుకొన్నాడు. ఇంట్లోవాళ్లు లేచి బయటకు వచ్చేసరికి రేకుల షెడ్డులో విగతజీవిగా కనిపించాడు. మృతుడికి భార్య సునీత, ఐదేండ్ల కుమారుడు, 13 ఏండ్ల కూతురు ఉన్నది. ప్రభుత్వం పరిహారం చెల్లించి మహేందర్ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. మృతుడి తండ్రి శంకరయ్య ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ దవాఖానకు తరలించారు.

### ఆర్థికంగా చితికి మరో రైతు బలవన్మరణం

భూత్పూర్, ఏప్రిల్ 6: మహబూబ్‌నగర్ జిల్లా మద్దిగట్ల గ్రామానికి చెందిన కొత్త కుర్వ శ్రీశైలం (30)కు రెండెకరాల పొలం ఉన్నది. యాసంగిలో వరి సాగు చేశాడు. ఉన్న ఒక్క బోరు ఒట్టిపోవటంతో రూ.1.50 లక్షలు అప్పు చేసి మరో రెండు బోర్లు డ్రిల్లింగ్ చేయించాడు. అయినా కొద్దిపాటి నీరే రావటంతో ఆందోళన చెందాడు. అప్పటికే పంట పెట్టుబడి కోసం అప్పు చేశాడు. దీనికి తోడు గొర్రెలను కొనుగోలు చేసి ఆర్థికంగా దెబ్బతిన్నాడు. బోర్లు వేయటంతోపాటు పంట కోసం, కుటుంబ పోషణ కోసం చేసిన అప్పు రూ.6.50 లక్షలకు చేరింది. అప్పు విషయంలో తరచూ భార్యాభర్తల మధ్య గొడవ జరిగేది. ఈ క్రమంలో శనివారం కూడా ఇద్దరు గొడవపడ్డారు. అప్పుల బాధ, వేసిన బోర్లలో నీళ్లు సరిగా రాకపోవటంతో తీవ్ర మనస్తాపం చెందిన శ్రీశైలం.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొన్నాడని ఇరుగు పొరుగువాళ్లు వెల్లడించారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. భర్త మరణంతో భార్య ఏమీ మాట్లాడలేని స్థితిలో ఉన్నారు.





నల్లగొండలో నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా ఆటో షోను ప్రారంభిస్తున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి. చిత్రంలో నమస్తే తెలంగాణ అడ్వర్టైజ్‌మెంట్ జనరల్ మేనేజర్ నెమరుగొమ్ముల సురేందర్‌రావు, ఏజీఎం రాజిరెడ్డి, బ్రాంచి మేనేజర్ టీ మహేందర్, బ్యూరో ఇన్‌చార్జి మర్రి మహేందర్‌రెడ్డి, మెగా ఆటో షోలో స్టాల్స్‌ను తిలకిస్తున్న సందర్శకులు

# స్వరాష్ట్రంలోనే ప్రజల ఆర్థికాభివృద్ధి

### నల్లగొండలో బెంజ్, వోల్వో కంపెనీలు రావడం హర్షణీయం

### 'నమస్తేతెలంగాణ, తెలంగాణ టుడే' ఆటో షో ప్రారంభించిన మండలి చైర్మన్ గుత్తా

రామగిరి, ఏప్రిల్ 6: 'తెలంగాణ వచ్చాకే రాష్ట్ర ప్రజల ఆర్థిక స్థితిగతుల్లో గణనీయమైన మార్పు వచ్చింది. నేటి ఆధునిక కాలానికి అనుగుణంగా ఓ వైపు ప్రజలను చైతన్యం చేసేలా వార్తలను ప్రచురించడం.. మరోవైపు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వివిధ కంపెనీల కార్లు, టూ వీలర్ వాహనాలతో నమస్తేతెలంగాణ మెగా ఆటో షో నిర్వహించడం అభినందనీయం' అని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో 'నమస్తేతెలంగాణ, తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో శనివారం మెగా ఆటో షో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుత్తా ముఖ్యఅతిథిగా హాజరై.. నమస్తేతెలంగాణ అడ్వర్టైజ్‌మెంట్ జనరల్ మేనేజర్ నెమరుగొమ్ముల సురేందర్‌రావు, ఏజీఎం రాజిరెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఆటో షోను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నల్లగొండలో ఇంత పెద్ద స్థాయిలో మెగా ఆటో షోను నిర్వహించడం హర్షణీయమని చెప్పారు. బెంజ్, వోల్వో వంటి పెద్ద పెద్ద కంపెనీల వాహనాలను ఇక్కడికి రప్పించి ప్రదర్శించడం చాలా బాగుందని తెలిపారు. తెలంగాణ ఏర్పడ్డాక ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడి కొనుగోలు శక్తి పెరిగి లగ్జరీ కార్లు వినియోగిస్తున్నారని చెప్పారు. కమర్షియల్ రంగంతోపాటు వ్యవసాయ రంగంలోనూ అవసరాలకు అనుగుణంగా అనేక కొత్త మాడల్స్ అందుబాటులోకి వస్తున్నాయని వివరించారు. ఈ అవకాశాన్ని నల్లగొండ జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయా కంపెనీల స్టాల్స్ వద్దకు వెళ్లి వాటి ఫీచర్స్, ధరలు, ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. తాను చదువుకునే రోజుల్లోనే రాయల్ ఎన్‌ఫీల్డ్ నడిపానంటూ నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. నూతన మాడల్ రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్, ట్రాక్టర్‌ను నడిపారు. యాక్టివా తీసుకున్న పజ్జూరు రైతు జె వెంకన్నకు తాళం చెవిని అందజేశారు.

ఈ కార్యక్రమంలో నమస్తేతెలంగాణ బ్రాంచి మేనేజర్ టీ మహేందర్, బ్యూరో ఇన్‌చార్జి మర్రి మహేందర్‌రెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జి మదూరి నరేందర్, ఏడీవీటీ మేనేజర్లు కైరంకొండ శివకుమార్, శ్రీచరణ్ ఆనంద్, సర్క్యులేషన్ మేనేజర్ మల్సూర్ గౌడ్, నమస్తేతెలంగాణ వివిధ భాగాల ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

### మెగా ఈవెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో మెగా ఆటో షోలు నిర్వహిస్తున్నాం. నల్లగొండలో నిర్వహించిన ఈ మెగా ఈవెంట్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. తొలిసారి నల్లగొండ జిల్లాలో బెంజ్, వోల్వో కార్లను అందుబాటులోకి తెచ్చి కొనే అవకాశం కల్పించింది మేమే. ఒకే వేదికపై వివిధ కంపెనీల కార్లు, ద్విచక్ర వాహనాలను అందుబాటులోకి తెచ్చి కొనుగోలుదారులకు సమయం ఆదాతోపాటు డిస్కౌంట్, బ్యాంకర్స్‌తో ఇక్కడే రుణ సదుపాయం కల్పించాం. ఈ ఆటో షోకు నల్లగొండలోని పవన్ మోటార్స్ వారు ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరించారు.

\- నెమరుగొమ్ముల సురేందర్‌రావు, నమస్తే తెలంగాణ అడ్వర్టైజ్‌మెంట్ జనరల్ మేనేజర్




జహీరాబాద్‌లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, ఎమ్మెల్యే మాణిక్‌రావు తదితరులు

# వడ్డీతో కలిపి చెల్లిస్తం

## కేసీఆర్ పొలంబాటతో మంత్రులకు దడ

**రైతులను ఆదుకోమంటే ఎదురుదాడా?**
**కేసీఆర్‌ను తిడితే కాంగ్రెస్ పోపాలు పోవు**
**ఓట్ల కోసం వచ్చేవారిని చీపుర్లతో తరమండి**
**కాంగ్రెస్ మెడలు వంచి హామీలు సాధిస్తం**
**దేవుడి పేరుతో బీజేపీ రాజకీయాలు**
**దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు పడిపోతున్నయ్**
**సంగారెడ్డి రైతుదీక్షలో హరీశ్‌రావు హెచ్చరిక**

సంగారెడ్డి, ఏప్రిల్ 6(నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలను వేధిస్తే ఊరుకునేది లేదని తమ ప్రభుత్వం వచ్చాక వడ్డీతో కలిపి బదులు తీర్చుకుంటామని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హెచ్చరించారు. కేసీఆర్ పొలంబాట పట్టడంతో కాంగ్రెస్ మంత్రులకు నిద్ర కరువైందని పేర్కొన్నారు. సంగారెడ్డిలోని కొత్త బస్టాండ్ సమీపంలో నిర్వహించిన రైతుదీక్షలో పాల్గొన్న హరీశ్‌రావు అనంతరం మాట్లాడుతూ.. కేసీఆర్ కరీంనగర్ పోయి ఎండిన పంటపొలాలు పరిశీలిస్తే మంత్రులు ఉలిక్కిపడుతున్నారని అన్నారు. రైతులను ఆదుకోవాలన్న కేసీఆర్‌పై మంత్రులు విరుచుకుపడడం సిగ్గుచేటని, ఆయన ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌ను మంత్రులు వ్యక్తిగతంగా దూషిస్తున్నారని మండిపడ్డారు. రైతుల పక్షాన నిలబడితే తిట్టడం ఏమిటని ప్రశ్నించారు. పంటనష్టపోయిన రైతులకు రూ. 25 వేలు, చనిపోయిన రైతు కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం ఇవ్వాలని, రూ. 500 బోనస్ ఇవ్వాలని, పంటలకు సాగునీరు ఇవ్వాలని కేసీఆర్ అడగడం తప్పా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌ను తిడితే కాంగ్రెస్ పోపాలు పోవని పేర్కొన్నారు. కేసీఆర్ పిలుపు మేరకు శనివారం రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ రైతుదీక్షలు చేపట్టినట్టు తెలిపారు. కరెంటు లేక, సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ. 2 లక్షల రుణమాఫీ చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

### కాంగ్రెస్ మెడలు వంచుతం

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో కాంగ్రెస్ సర్కారు విఫలమైందని, దాని మెడలు వంచి హామీలు అమలు చేయిస్తామని హరీశ్‌రావు తెలిపారు. ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలను కాంగ్రెస్ గాలికి వదిలేసిందని విమర్శించారు. హామీలు నిలబెట్టుకోకుండా ఓట్లు అడిగేందుకు గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ నేతలను చీపుర్లతో తరిమికొట్టాలని మహిళలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకునే వరకు బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. ఎంపీ ఎన్నికల్లో ప్రజల పక్షాన నిలిచి పోరాటాలు చేసే బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందేనని విమర్శించారు. బీజేపీ దేవుడు పేరుతో రాజకీయాలు చేస్తున్నదని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వాలు పడిపోతున్నాయని, తెలంగాణలోనూ అదే జరుగుతుందని జోస్యం చెప్పారు. దీక్షలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, ఎంపీపీలు సరళ, యాదమ్మ, నాయకులు గాలి అనిల్‌కుమార్, దేవీప్రసాద్, రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, కాసాల బుచ్చిరెడ్డి, మల్లాగౌడ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాహుల్.. నీ జిమ్మేదారీ ఏమాయె?

- **మాజీ మంత్రి హరీశ్‌రావు**

సంగారెడ్డి, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ): ఆరు గ్యారెంటీలకు తనదే జిమ్మేదారీ అన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇప్పుడు తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. 6 గ్యారెంటీల జిమ్మేదారీ ఏమాయె? అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన గ్యారెంటీల హామీ.. అధికారంలోకి వచ్చి 120 రోజులు గడిచినా నెరవేరలేదని విమర్శించారు. శనివారం జహీరాబాద్‌లో ఎమ్మెల్యే మాణిక్‌రావు అధ్యక్షతన జరిగిన జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశంలో, సిద్దిపేట నియోజకవర్గంలోని నారాయణరావుపేట మండలం జక్కాపూర్‌లో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్ పాల్గొని మాట్లాడారు. 'పార్టీ మారిన తక్షణమే ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు చేయాలని రాహుల్‌గాంధీ కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టారు. ఇక్కడేమో.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకుంటామంటున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంటున్నారు. కాంగ్రెస్‌లో రాహుల్ మ్యానిఫెస్టో, రేవంత్‌రెడ్డి మ్యానిఫెస్టో వేర్వేరా? కాంగ్రెస్ హైకమాండ్ అంటే మంత్రులు, కాంగ్రెస్ ప్రభుత్వానికి లెక్కలేదా?' అని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్‌లో చేరేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రెడీగా ఉన్నారని, వాళ్లను తాము చూసుకుంటామని మంత్రి ఉత్తమ్ చేసిన వ్యాఖ్యలపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సిగ్గుందా? అని మండిపడ్డారు. కాంగ్రెస్ అభద్రతా భావంలో ఉన్నదని, బీఆర్ఎస్‌ను చూసి భయపడుతున్నదని, అందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. బీఆర్ఎస్‌ను బలహీనపరిస్తే తమకు అడ్డు ఉండదని కాంగ్రెస్ భావిస్తున్నదని, అయితే కాంగ్రెస్ ఆటలు సాగవని స్పష్టం చేశారు. చంద్రబాబు, వైఎస్, కిరణ్‌కుమార్‌రెడ్డి వంటివారు తెలంగాణ ఉద్యమాన్ని అణిచివేయాలని చూశారని, అక్రమ కేసులు కూడా పెట్టారని గుర్తుచేశారు. అయినా కేసీఆర్ నేతృత్వంలో ఎక్కడా తలవంచకుండా పోరాడి తెలంగాణ సాధించుకున్నామని తేల్చి చెప్పారు. ఇప్పుడూ ఎవరికీ భయపడకుండా కాంగ్రెస్‌పై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకులపై ప్రభుత్వం, పోలీసులు అక్రమ కేసులు పెట్టాలని చూస్తే సహించేది లేదని అన్నారు. ఏ నాయకుడు, కార్యకర్తకు ఆపదొచ్చినా తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వాలు పడిపోతున్నాయని తెలంగాణలోనూ అదే జరుగుతుందని వ్యాఖ్యానించారు. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని వెల్లడించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దేవీప్రసాద్, శివకుమార్, జైపాల్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, నరహరిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మర్లవడ్డ మాదిగ

**కాంగ్రెస్ తీవ్ర అన్యాయం చేసిందని ఆగ్రహం**
**ప్రతీకారం తీర్చుకునేందుకు ఎదురుచూపు**
**లోక్‌సభ ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరిక**

హైదరాబాద్, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్ పార్టీపై మాదిగ సామాజికవర్గం తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నది. తమకు కాంగ్రెస్ తీరని అన్యాయం చేసిందని రగిలిపోతున్న ఆ సామాజికవర్గం అందుకు ప్రతీకారం తీర్చుకోవాలని ఎదురుచూస్తున్నట్టు ఇటీవలి పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ తమకు తీరని అన్యాయం చేసిందని, తమను కేవలం ఓటుబ్యాంకుగా వాడుకొని వదిలేస్తున్నదని ఎమ్మార్పీఎస్ అగ్రనేత మంద కృష్ణమాదిగ ఇప్పటికే పలుమార్లు ధ్వజమెత్తారు. నాగర్‌కర్నూల్‌లో మాదిగల సంఖ్య అధికంగా ఉన్నా, అన్ని సర్వేల్లో మాదిగలకే మొగ్గు ఉన్నా ఆ లోక్‌సభ టికెట్‌ను మాల సామాజికవర్గానికి కేటాయించటం వెనుక భారీ కుట్ర ఉన్నదని కాంగ్రెస్ సీనియర్ నేత సంపత్ ఏకంగా రాహుల్ గాంధీకే లేఖ రాశారు. పెద్దపల్లి లోక్‌సభ సెగ్మెంట్‌లో కాంగ్రెస్ అభ్యర్థికి తగిన గుణపాఠం తప్పదని మాదిగలు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాల్లో నాగర్‌కర్నూల్, పెద్దపల్లి, వరంగల్ ఎస్సీలకు రిజర్వ్ అయ్యాయి. రాష్ట్రంలోని జనాభా దామాషా ప్రకారం ఈ మూడింటిలో రెండు స్థానాలను మాదిగ సామాజిక వర్గానికి, ఒక స్థానాన్ని మాల సామాజికవర్గానికి కేటాయించటం ఆనవాయితీగా కొనసాగుతున్నది. దీనికి విరుద్ధంగా కాంగ్రెస్ ఆ మూడు స్థానాలనూ మాలలకే కేటాయించటం మాదిగలకు తీవ్ర ఆగ్రహాన్ని కలిగిస్తున్నది. దీంతో కాంగ్రెస్ పార్టీలోని మాదిగ సామాజికవర్గ నేతలు లేఖల ద్వారా తమ నిరసనను అధిష్టానానికి తెలియజేశారు. లోక్‌సభ సీట్ల కేటాయింపులో మాదిగలకు అన్యాయం జరగడానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ సీనియర్ నేత కొప్పుల రాజు లాంటి వారే కారణమని వారు ఆరోపిస్తున్నారు.

### వారికోనీతి మాకో నీతా?

కాంగ్రెస్ పార్టీలో సీఎం రేవంత్‌రెడ్డి సామాజికవర్గానికి ఒకనీతి మాదిగలకు మరో నీతా? అంటూ కృష్ణమాదిగ ప్రెస్‌క్లబ్ సాక్షిగా ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న జీవన్‌రెడ్డి ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల నుంచి ఓడిపోయినా ఆయనకు నిజామాబాద్ పార్లమెంట్ టికెట్ ఇచ్చారని.. కానీ, స్టేషన్‌ఘన్‌పూర్‌లో రెండుసార్లు ఓడిపోయిన సిరిపురం ఇందిరకు మాత్రం వరంగల్ టికెట్ ఇవ్వలేదని కృష్ణమాదిగ ఉదహరించారు. దీన్ని బట్టే మాదిగల పట్ల కాంగ్రెస్ ఎంత వివక్ష చూపుతున్నదో అర్థం చేసుకోవచ్చని అన్నారు. వరంగల్ లోక్‌సభ టికెట్‌ను కడియం శ్రీహరి కూతురు కడియం కావ్యకు ఎలా ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. ఆ స్థానంలో కాంగ్రెస్ తరఫున పోటీ చేసేందుకు మాజీ డిప్యూటీ సీఎం డాక్టర్ టి.రాజయ్య, దొమ్మాటి సాంబయ్య, సిరిపురం ఇందిర, ఎంపీ పసునూరి దయాకర్ సరిపోరా? అని నిలదీశారు. అలాగే మాలల కంటే మాదిగల జనాభా అధికంగా ఉన్న నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్‌నే నమ్ముకొన్న సంపత్‌కు లేని అర్హత ఏమిటి? ఆ సీటుకు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మల్లు రవికి ఉన్న అర్హతలేమిటి? అని మాదిగ సామాజికవర్గం నిప్పులు చెరుగుతున్నది. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్‌ది కుటుంబపాలన అంటూ విమర్శించిన సీఎం రేవంత్‌రెడ్డికి పెద్దపల్లి లోక్‌సభ స్థానాన్ని ఎవరికి కేటాయించారో తెలియదా? అని కృష్ణమాదిగ ప్రశ్నించారు. ఇప్పటికే ఒకే కుటుంబానికి చెందిన గడ్డం వినోద్, గడ్డం వివేక్ వెంకటస్వామికి ఎమ్మెల్యే పదవులు కట్టబెట్టిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు మళ్లీ అదే కుటుంబంలోని వంశీకి లోక్‌సభ టికెట్‌ను కేటాయించడంపై మాదిగలు ఆగ్రహంతో ఉన్నట్టు ఇటీవల ఓ సర్వేలో వెల్లడైంది.



ఎంపీ టికెట్ల కేటాయింపులో మాదిగలకు కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసిందని ఆరోపిస్తూ శనివారం ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జనగామ జిల్లా నర్మెటలోని జనగామ-హుస్నాబాద్ రహదారిపై సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. రెండు పార్లమెంట్ స్థానాలను మాదిగలకు కేటాయించకుంటే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు.

## లోకం పోకడ




నీళ్లున్న చోట ఆపాలంటూ మహిళలు ఫ్రీ బస్సులను అలా వాడుకుంటున్నారు సార్!

## ఎండా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| నల్లగొండ | 43.8°c | 34.8°c |
| ఆదిలాబాద్ | 43.4°c | 24.5°c |
| మెదక్ | 43.2°c | 21.9°c |
| రంగారెడ్డి | 43.1°c | 20.5°c |
| నిజామాబాద్ | 41.7°c | 27.4°c |
| ఖమ్మం | 41.0°c | 23.0°c |
| కరీంనగర్ | 41.0°c | 27.0°c |
| వరంగల్ | 41.0°c | 26.0°c |
| హైదరాబాద్ | 40.6°c | 26.2°c |
| మహబూబ్‌నగర్ | 40.3°c | 27.4°c |



## వరంగల్ ఎంపీ టికెట్ కేటాయించండి

### కేటీఆర్‌కు వంగపల్లి శ్రీనివాస్ వినతి

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ టికెట్‌ను తనకు కేటాయించాలని టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కోరారు. శనివారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మలి విడత తెలంగాణ ఉద్యమంలో మొదట అరెస్ట్ అయిన తొమ్మిది మంది విద్యార్థి నేతల్లో తాను ఒకడినని, సాగరహారం, మిలియన్ మార్చ్‌తోపాటు ఓయూ టు కేయూ విద్యార్థి పాదయాత్రకు నేతృత్వం వహించినట్టు వెల్లడించారు. దండోరా పరంగా అత్యధిక కేసులను ఎదుర్కొన్న వ్యక్తిని కూడా తానేనని తెలిపారు. తెలంగాణ, మాదిగ ఉద్యమాల నేపథ్యం ఉన్న తనకు టికెట్ ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా కేటీఆర్ సానుకూలంగా స్పందించినట్టు వంగపల్లి తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని మాట ఇచ్చినట్టు ఆయన పేర్కొన్నారు.

## పీసీబీకి 'అల్లుడు'!

మొదటిపేజీ తరువాయి...

క్రితం వరంగల్ రీజినల్ సెంటర్‌లో ఇంటర్న్‌షిప్‌కు అవకాశం కల్పించారు. మూడు నెలల్లో ముగియాల్సి ఉండగా, అతను మూడేండ్లుగా అక్కడే అదే ఇంటర్న్‌షిప్ పేరుతో కొనసాగించడం వివాదాస్పదం అవుతున్నది. బీహెచ్ఈఎల్ లాంటి కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసిన వారికి ఇతర కంపెనీల్లో ఉద్యోగం పొందడానికి ఉపయోగపడుతుంది. కానీ సివిల్ ఇంజినీరింగ్ అభ్యర్థికి పీసీబీలో పొందిన ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్ ఏ విధంగా పనికి వస్తుందనే విషయంలో స్పష్టత లేదు. ఒకవైపు ఆ అధికారి తన మేనల్లుడిని నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తుండగా, నెలకు రూ.25 వేల చొప్పున ఫెలోషిప్ చెల్లించడమూ చర్చనీయాంశంగా మారింది. తనిఖీల పేరుతో తన మేనల్లుడిని కంపెనీలకు స్వయంగా పంపించడం, అతను చేసిన తనిఖీలను తన పేరిట రికార్డులు రూపొందిస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి.

### ఆఫీసుకు రాకున్నా టంచన్‌గా సంతకాలు

బోర్డు ఎన్విరాన్‌మెంట్ ఇంజినీరింగ్ విభాగం హైదరాబాద్ కార్యాలయంలో ఓ ఉన్నతస్థాయి అధికారి భార్య ఎన్విరాన్‌మెంట్‌లో పనిచేస్తున్నారు. ఆమె రోజువారీగా విధులకు హాజరుకావడం లేదని విమర్శలున్నాయి. వారానికి ఒకసారి లేదా నెలకు ఒకసారి కార్యాలయానికి వచ్చి సంతకాలు మాత్రమే చేస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. ఈమె చాలా ఏండ్లుగా ఇదే విధంగా వ్యవహరిస్తున్నారని, ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టిలో ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదనే ప్రచారం జరుగుతున్నది. ఇటీవల అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయాన్ని సందర్శించినప్పుడు ఈ విషయాన్ని గుర్తించినట్టు తెలిసింది. ఆయా విషయాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వస్తున్నది.